అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..




అసెంబ్లీ అరెస్టులపై

## బీఆర్ఎస్ నిరసన

6


WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103



సంపుటి - 3 సంచిక -91 మంగళవారం 8 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


## తెలంగాణలో 'ఎస్ఐఆర్' మరోసారి పొడిగింపు

**అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్స్ స్వీకరణ**

**సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తిని అంగీకరించిన ఎన్నికల సంఘం**

**నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల**




**హైదరాబాద్,సెప్టెంబరు 7(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమం గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లు దాఖలు చేసేందుకు అక్టోబర్ 7వ తేదీ మిగతా 2లో.

## త్రివిధ దళాల సామర్థ్యం మరింత బలోపేతం

**1.10 లక్షల కోట్లతో ఆయుధాలు కొనుగోళ్లు**

**అత్యాధునిక ఆరుద్ర రాడార్లుకు ప్రాముఖ్యత**

**కొనుగోళ్ల ప్రతిపాదనలకు ఆమోదముద్ర**



2లో.

# స్పీకర్‌పై ఎమ్మెల్సీ అనుచిత వ్యాఖ్యలు

## సభలో కన్నీరు పెట్టిన తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్

**కేసీఆర్ క్షమాపణ చెప్పాలని అసెంబ్లీలో సీఎం రేవంత్ డిమాండ్**

**తాతా మధు వ్యాఖ్యలపై సీఎం ఆగ్రహం**

**ఎమ్మెల్సీని డిస్మిస్ చేయాలని మండలి చైర్మన్‌ను కోరిన వైనం**

**బీఆర్ఎస్ నేతలపై సీఎం తీవ్ర ఆరోపణలు**

**హైదరాబాద్, సెప్టెంబరు 7(జర్నలిస్ట్ వార్త):** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు చేస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణలో రాజకీయ దుమారం నెలకొంది. మరోవైపు మంత్రి సీతక్క భావోద్వేగానికి గురికాగా, స్పీకర్ గడ్డం మిగతా 2లో.





## డీఎస్సీపై ఆరోపణలు నిరాధారం

**వేధిస్తే కఠిన చర్యలు: ఏపీ ప్రభుత్వం**



**స్పోర్ట్స్ కోటా ఎంపికలు పారదర్శకంగా జరిగాయన్న క్రీడా ప్రాధికార సంస్థ (శాప్)**

**ఉపాధ్యాయులను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**

**టెట్ అర్హతలపై పలువురు అభ్యర్థుల విషయంలో స్పష్టత ఇచ్చిన అధికారులు**

**అమరావతి సెప్టెంబరు 7(జర్నలిస్ట్ వార్త):** ఏపీ మెగా డీఎస్సీ 2025 నియామకాలపై గత పది రోజులుగా సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో వస్తున్న ఆరోపణలను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. స్పోర్ట్స్ కోటా సహా ఇతర నియామకాల్లో ఎలాంటి అక్రమాలు జరగలేదని, మొత్తం ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని స్పష్టం చేసింది. అమరావతిలోని విద్యాభవన్ లో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) వైస్ ఛైర్మన్ అండ్ ఎండీ భరణి సంయుక్తంగా మిగతా 2లో.

# ఇది దుశ్శాసన సభ..

**మహిళా నేతల జుట్టు పట్టుకుని ఈడ్చేస్తారా?: కేటీఆర్**

**శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళితే ఉక్కుపాదం మోపారన్న కేటీఆర్**

**తాము ఎలాంటి అన్‌పార్లమెంటరీ భాష మాట్లాడలేదని వెల్లడి**

**ఈ దాడి వెనుక రేవంత్ రెడ్డి కుట్ర ఉందని ఆరోపణ**



**హైదరాబాద్, సెప్టెంబరు 7(జర్నలిస్ట్ వార్త):** ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు అసెంబ్లీకి వెళ్లిన ప్రతిపక్ష సభ్యులపై పోలీసులు అత్యంత కిరాతకంగా వ్యవహరించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మిగతా 2లో.

# కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

**బీజేపీ వ్యతిరేక ఓట్లపై ప్రత్యేక నిఘా ఉందని ఆరోపణ**

**కొడంగల్‌లో 81 వేల ఓట్లు అనామలీస్ జాబితాలో ఉన్నాయని వెల్లడి**

**2029లో మోదీ ఓటమికి పునాది అన్న సీఎం**

**పేదలు, గిరిజనుల ఓట్లపైనా కుట్ర జరుగుతోందని ఆరోపణ**



**హైదరాబాద్, సెప్టెంబరు 7(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యతిరేక ఓటర్లను గుర్తించేందుకు బీజేపీ ప్రత్యేక ఏజెన్సీలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. 2009 నుంచి ఓటింగ్ సరళిని మిగతా 2లో.



## రాష్ట్రానికి మూడో ప్రత్యామ్నాయం

**ఆ రెండు ఫ్యాక్షన్ పార్టీలే.. ప్రజలకు గోరంత, తమకు కొండంత వాటి ఎజెండా: విజయసాయిరెడ్డి**

**కొత్త పార్టీ పెట్టడానికి ముందు ప్రజల సమస్యలు వివరిస్తానని వెల్లడి**

**ఏపీలో వైసీపీ, టీడీపీ, జనసేనలకు ప్రజా సమస్యలు పట్టవని విమర్శ**

**రాష్ట్ర సంపదను దోచుకోవడమే ఆ పార్టీల ఎజెండా అని వ్యాఖ్య**

**ఈ పరిస్థితుల్లో మూడో ప్రత్యామ్నాయం తప్పనిసరి అన్న విజయసాయి**

**అమరావతి సెప్టెంబరు 7(జర్నలిస్ట్ వార్త):** మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఏపీ రాజకీయాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. త్వరలో తాను ఏర్పాటు చేయబోయే నూతన రాజకీయ పార్టీ జెండా, అజెండాను ప్రకటించే ముందు, రాష్ట్రంలోని సమస్యలను ప్రజల ముందు ఉంచుతానని స్పష్టం చేశారు. ఏపీకి ఇప్పుడు మూడో మిగతా 2లో.

# అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ బిగ్ ఫైట్..

**కేటీఆర్ అరెస్టు, టీషర్ట్ విప్పేసిన హరీశ్ రావు -కేటీఆర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్-పోలీసుల మధ్య తోపులాట -పలువురు నేతలు టీషర్టులు విప్పి నిరసన**

**నేతలకు గాయాలైనట్లు బీఆర్ఎస్ ఆరోపణ- కౌశిక్‌రెడ్డి సహా నేతలతో పోలీసుల వాగ్వాదం**




2లో.

## కార్యకర్తలే బలం..

**లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో చంద్రబాబు**

**కార్యకర్తలను రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం చేయాలని ఎమ్మెల్యేలకు సీఎం సూచన**

**సమస్యల పరిష్కారంలో మంత్రులు పూర్తి బాధ్యత వహించాలని స్పష్టీకరణ**



**అమరావతి సెప్టెంబరు 7(జర్నలిస్ట్ వార్త):** తెలుగుదేశం పార్టీ నిర్వహించిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు కీలక దిశానిర్దేశం చేశారు. కార్యకర్తల రాజకీయ, ఆర్థిక సాధికారతకు కృషి చేయాలని, అదే సమయంలో స్వర్ణాంధ్ర విజన్-2047ను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని స్పష్టం చేశారు. కార్యకర్త బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందని, వారిని నిరాశకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదేనని ఆయన ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "టీడీపీ కార్యకర్త హుషారుగా ఉంటే గెలుపును ఎవరూ ఆపలేరు. కార్యకర్తల్లో చాలా మంది మిగతా 2లో.

# రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దాం

**మొదటి పేజీ తరువాయి**

పేదవారు ఉన్నారు. ప్రభుత్వ పథకాల ఫలాలు వారికి అందేలా చూడాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బాగా పనిచేసిన వారికి, అక్కడి పరిస్థితులను బట్టి టికెట్లు కేటాయిస్తాం. వారు వ్యాపారాలు చేసుకుని అభివృద్ధి చెందేలా ఎమ్మెల్యేలు ప్రోత్సాహం, మార్గనిర్దేశం అందించాలి. ప్రజలు మెచ్చే విధంగా కార్యకర్తలకు న్యాయం చేస్తాం" అని హామీ ఇచ్చారు. జిల్లాల్లో, నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే బాధ్యతను మంత్రులు తీసుకోవాలని, లేనిపక్షంలో వారే జవాబుదారీగా ఉండాల్సి వస్తుందని హెచ్చరించారు.

**విజన్-2047తో నియోజకవర్గాల అభివృద్ధి**

స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌పై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విజన్‌కు నియోజకవర్గాల స్థాయిలో ఎమ్మెల్యేలు తమ ఆలోచనలతో విలువ జోడించాలని (వాల్యూ ఎడిషన్) సూచించారు. "విజన్ ప్లాన్ అమలు చేస్తే అభివృద్ధి సాధ్యమవడమే కాదు, ఎన్నికల్లోనూ గెలుపు ఖాయం. పేద-ధనిక మధ్య అంతరాలు తగ్గించడమే ఈ విజన్ ప్రధాన లక్ష్యం. ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ, ప్రతి నియోజకవర్గానికి రూ.1 కోటి చొప్పున కేటాయించాలని నిర్ణయించాం" అని తెలిపారు.కేంద్ర మంత్రులుగా ఉన్నవారు జాతీయ స్థాయిలో శాఖలను పర్యవేక్షిస్తున్న స్ఫూర్తితోనే తమ జిల్లాలను అభివృద్ధి చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధుల్లో ఉన్నత విద్యావంతులు, రిటైర్డ్ ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు ఉన్నారని, వారంతా తమ అనుభవంతో విజన్ డాక్యుమెంట్లను అధ్యయనం చేసి, వినూత్నంగా ఆలోచించాలని కోరారు. "వందేళ్లలో జరిగే పనులను పదేళ్లలో పూర్తి చేసే టెక్నాలజీ ఇప్పుడు అందుబాటులో ఉంది. ప్రతి ఎమ్మెల్యే అకుంఠిత దీక్షతో పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చు" అని చంద్రబాబు అన్నారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు 28 కొత్త పాలసీలు తీసుకొచ్చినట్లు ఆయన గుర్తుచేశారు.

# త్రివిధ దళాల సామర్థ్యం మరింత బలోపేతం

**న్యూఢిల్లీ సెప్టెంబరు 7(జర్నలిస్ట్ వార్త):** దేశ త్రివిధ దళాల సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణశాఖ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఏకంగా 1.10 లక్షల కోట్ల రూపాయల వ్యయంతో ఆయుధాలు, సైనిక పరికరాల కొనుగోళ్లకు పచ్చజెండా ఊపింది. ఈ మేరకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ పలు కీలక ప్రతిపాదనలకు ప్రాథమిక ఆమోదం తెలిపింది. 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా ఆమోదం పొందిన ప్రతిపాదనల్లో 98 శాతం దేశీయ రక్షణ రంగ సంస్థల నుంచే కొనుగోళ్లు చేయనున్నట్లు స్పష్టం చేసింది.సాయుధ దళాల ఆధునీకరణే లక్ష్యంగా ఈ ఏడాదిని 'సంస్కరణల సంవత్సరం'గా ప్రకటించిన రక్షణశాఖ త్రివిధ దళాల బలోపేతానికి కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎలాంటి పరిస్థితులనైనా దీటుగా ఎదుర్కొనేందుకు వీలుగా సైన్యానికి అవసరమైన ఆయుధ పరికరాల సేకరణకు పచ్చజెండా ఊపింది. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ ఏకంగా రూ. 1.10 లక్షల కోట్ల విలువైన ఆయుధ సంపత్తి కొనుగోళ్ల ప్రతిపాదనలకు ప్రాథమిక ఆమోదముద్ర వేసింది. డీఏసీ ఆమోదించిన ప్రతిపాదనల్లో భారత సైన్యానికి అవసరమైన కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్, న్యూక్లియర్ రెక్కీ వాహనాలు ఉన్నాయి. ఈ వాహనాలు కలుషితమైన ప్రాంతాలను గుర్తించి, పర్యవేక్షించడంతో పాటు మార్కింగ్ చేయడంలో కీలకపాత్ర పోషిస్తాయి. అత్యంత క్లిష్టమైన సరిహద్దు భూభాగాల్లో దళాల వేగవంతమైన కదలికలు, లాజిస్టిక్స్, ఆపరేషనల్ సపోర్ట్ కోసం హై మొబిలిటీ వెహికల్స్ కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. శత్రువులకు ముకుతాడు వేసేలా సవాలుతో కూడిన ప్రాంతాల్లో అత్యంత వేగంగా, సమర్థవంతంగా మందుపాతరలను అమర్చేందుకు సెల్ఫ్-ప్రొపెల్డ్ మెకానికల్ మైన్ లేయర్స్ కొనుగోలుకు సైతం ఆమోదముద్ర వేసింది. యుద్ధ సమయాల్లో క్లిష్టమైన భౌగోళిక ప్రాంతాల్లో అత్యంత సంక్లిష్టమైన మిషన్లలో కీలకంగా వ్యవహరించే అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లు, ట్రాల్ ట్యాంకులు, సర్వత్ర బ్రిడ్జ్ సిస్టమ్, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ల కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది.

భారత నావికాదళం కోసం 'ఆరుద్ర' రాడార్లతో పాటు మెరైన్ గ్యాస్ టర్బైన్ల రూపకల్పన, అభివృద్ధి, కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. వివిధ నావల్ ఎయిర్ స్టేషన్లలో ప్రస్తుతం ఉన్న ఎయిర్ రూట్ సర్వైలెన్స్ రాడార్ల స్థానంలో ఈ అత్యాధునిక ఆరుద్ర రాడార్లను ప్రవేశపెట్టనున్నారు. యుద్ధనౌకలకు ఇంధన సిస్టమ్‌గా పనిచేసే మెరైన్ గ్యాస్ టర్బైన్ల కొనుగోలుతో ఇంజిన్ల విషయంలో విదేశీ సంస్థలపైన ఆధారపడటం తగ్గుతుందని రక్షణ శాఖ స్పష్టం చేసింది.భారత వాయుసేనకు చెందిన ఫైటర్ జెట్లు, రవాణా విమానాలు, హెలికాప్టర్ల యుద్ధ సామర్థ్యాన్ని పెంచే పలు ప్రతిపాదనలకు సైతం డీఏసీ ఆమోదం తెలిపింది. శత్రుదేశాల నిఘా రాడార్లను సమర్థంగా అడ్డుకునే గ్రౌండ్-బేస్డ్ మల్టీ-పర్పస్ జామర్ల కొనుగోలుకు పచ్చజెండా ఊపింది. రక్షణ వ్యవస్థల భద్రతను డిజిటలైజ్ చేస్తూ 'డిఫెన్స్ ఫోర్సెస్ సెక్యూర్ యాక్సెస్ కార్డ్' వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు డీఏసీ అంగీకారం తెలిపింది. దీని ద్వారా దళాల్లో ఇప్పటివరకు ఉన్న పాత పేపర్ గుర్తింపు కార్డులు, పాస్‌లు, పర్మిట్ల స్థానంలో పరస్పరం పనిచేసే అత్యాధునిక స్మార్ట్ కార్డులను అమలు చేయనున్నారు. ఈ కొనుగోలులో 98 శాతం దేశీయ పరిశ్రమల నుంచే సేకరించనున్నట్లు రక్షణ శాఖ స్పష్టం చేసింది. తద్వారా 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి మరింత ఊతమిస్తుందని వెల్లడించింది.

# తెలంగాణలో 'ఎస్ఐఆర్' మరోసారి పొడిగింపు

**మొదటి పేజీ తరువాయి**

వరకు అవకాశం కల్పించింది. ఈ మేరకు సవరించిన షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేసింది.

గతంలో పొడిగించిన షెడ్యూల్ ప్రకారం ఈ గడువు సెప్టెంబర్ 16తో ముగియాల్సి ఉంది. అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు మరింత సమయం కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి వేర్వేరుగా లేఖలు రాశారు. వారి విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం, గడువును మరోసారి పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది.కొత్త షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలను స్వీకరించి, వాటిని పరిష్కరించిన అనంతరం నవంబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈసీ నిర్ణయంతో కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే వారికి, అలాగే జాబితాలో తప్పులను సరిదిద్దుకోవాలనుకునే వారికి అదనపు సమయం లభించినట్లయింది.

# స్పీకర్‌పై ఎమ్మెల్సీ అనుచిత వ్యాఖ్యలు..

**మొదటి పేజీ తరువాయి**



ప్రసాద్ కూడా సభలోనే కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా శాసనసభాపతిపై అనుచిత భాషలో వ్యాఖ్యలు చేయడాన్ని సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. స్పీకర్ పదవిని అవమానించడం ఒక్క వ్యక్తిని కించపరచడం కాదని అది మొత్తం శాసనసభ గౌరవానికి, ప్రజాస్వామ్య వ్యవస్థకు జరిగిన అవమానమన్నారు. ఇది తెలంగాణ చరిత్రలోనే చీకటి రోజుగా సీఎం అభివర్ణించారు. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని సీఎం రేవంత్ డిమాండ్ చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన సభ్యుడితో తక్షణమే రాజీనామా చేయించాలని, అవసరమైతే అతని పార్టీ సభ్యత్వాన్ని కూడా రద్దు చేయాల్సిందిగా కోరారు.శాసనసభలో జరిగిన ఈ ఘటనపై సీఎం తీవ్ర భావోద్వేగంతో మాట్లాడారు. "స్పీకర్ స్థానం రాజ్యాంగబద్ధమైన అత్యున్నత స్థానం.. సీఎం నుంచి సాధారణ సభ్యుడి వరకు ప్రతి ఒక్కరూ ఆ పదవిని గౌరవించాల్సిందే..స్పీకర్ మనసు గాయపడేలా, ఆయన కుటుంబాన్ని కించపరిచేలా మాట్లాడటం క్షమించరాని నేరం" అని వ్యాఖ్యానించారు. దళిత సామాజిక వర్గానికి చెందిన సభాపతిని అవమానించిన అంశాన్ని తాను దళిత ప్రజాప్రతినిధులందరికీ జరిగిన అవమానంగా భావిస్తున్నానన్నారు. బీఆర్ఎస్ దళిత వ్యతిరేక వైఖరిని అవలంబిస్తోందని ఆరోపించారు. తెలంగాణ ఏర్పడితే దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పి మాట తప్పారని, మూడెకరాల భూమి హామీని అమలు చేయలేదని రేవంత్ విమర్శించారు. తొలి ప్రభుత్వంలోనే దళిత ఉపముఖ్యమంత్రిని బర్తరఫ్ చేశారని, నేరెళ్ల ఘటనలో దళితులపై దాడులు జరిగాయని ప్రస్తావించారు.ఇలాంటి ఘటనలు రాజకీయాలకు అతీతంగా ఖండించాలని రేవంత్ రెడ్డి సూచించారు. ప్రభుత్వం సంయమనం పాటిస్తే బలహీనతగా భావించవద్దన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను బెదిరింపులతో ప్రభావితం చేయాలనుకుంటే సహించబోమని స్పష్టం చేశారు. సభలో చర్చ అనంతరమే నిర్ణయాలు తీసుకుంటామన్నారు.ఘటనపై కఠిన సభా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ దుర్మార్గపు పోకడలను రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. ఇలాంటివి కట్టడి చేయకపోతే సమాజం మనలను క్షమించరని, ఇలాంటి దుర్మార్గమైన తక్షణమే చర్యలు కట్టడి చేయాలన్నారు. ప్రతిపక్ష నేత ఫామ్ హౌస్‌లో ఉండి ప్రోత్సహిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. స్పీకర్‌పై తాతా మధు వ్యాఖ్యలపై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇద్దరు మండలి సభ్యులు బూతులు మాట్లాడారన్నారు. తాతా మధు, నవీన్ మీద చర్యలు తీసుకోవాలని.. వీధుల్లో కొట్లాడినట్లు.. అసెంబ్లీ ముందు ప్రవర్తించారంటూ మండిపడ్డారు. అసెంబ్లీకి రాకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితం అయ్యారని.. కేసీఆర్ డైరెక్షన్‌లోనే ఈ వ్యవహారం జరిగిందని సీతక్క పేర్కొన్నారు. సభలో ప్రసంగిస్తూ మంత్రి సీతక్క భావోద్వేగానికి గురయ్యారు.. స్పీకర్ స్థానాన్ని అవమానించడం సరికాదన్నారు..

# డీఎస్సీపై ఆరోపణలు నిరాధారం

**మొదటి పేజీ తరువాయి**

మీడియా సమావేశం నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడించారు. ఉపాధ్యాయులను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడితే కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**స్పోర్ట్స్ కోటా నియామకాలు పారదర్శకం: శాప్**

స్పోర్ట్స్ కోటా ఎంపికలు కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగానే జరిగాయని శాప్ ఎండీ భరణి తెలిపారు. తుది జాబితాకు ముందు 1:5 నిష్పత్తిలో అభ్యర్థుల జాబితాను విడుదల చేసి, 2025 ఆగస్టు 8 నుంచి 14 వరకు అభ్యంతరాలకు అవకాశం కల్పించామని, ఆ సమయంలో జూడో సర్టిఫికెట్లపై ఎలాంటి ఫిర్యాదులు రాలేదని వివరించారు.

ప్రస్తుతం హైకోర్టులో ఉన్న ప్రజాప్రయోజన వ్యాజ్యం (గ్రా.ఖా చీశీ. 170) కూడా డీఎస్సీ నియామకాలు పూర్తయిన ఏడాది తర్వాత దాఖలైందని, దాని పరిధి 2018 నుంచి జరిగిన అన్ని క్రీడా కోటా నియామకాలపై ఉందని తెలిపారు. స్పోర్ట్స్ కోటాలో రాత పరీక్ష మార్కులతో సంబంధం లేకుండా క్రీడాకారుల ప్రతిభకే తొలి ప్రాధాన్యత ఉంటుందని, ఇది రాష్ట్ర, జాతీయ స్థాయిలో సాధారణ ప్రక్రియ అని స్పష్టం చేశారు.

కొందరు క్రీడాకారులపై వచ్చిన ఆరోపణలను కూడా అధికారులు ఖండించారు. జాతీయ స్థాయి బాక్సర్ పెద్ద అప్పల రాజు విషయంలో ఆన్‌లైన్‌లో పొరపాటున సోదరుడి సర్టిఫికెట్ అప్‌లోడ్ చేసినా, తర్వాత సరిదిద్దుకున్నారని.. ఆయన పత్రాలన్నీ నిజమైనవేనని వీడియో ఫుటేజ్‌తో సహా నిర్ధారించుకున్నామని తెలిపారు. అలాగే, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా టీడీపీ ఎమ్మెల్యే కోన రవికుమార్ సంతకం చేయడంపై మాట్లాడుతూ.. జాతీయ సమాఖ్య అధికారికంగా అనుమతి ఇచ్చినందునే ఆయన సంతకం చేశారని, ఇది నిబంధనలకు విరుద్ధం కాదని స్పష్టం చేశారు.

**టెట్ అర్హతలపై పూర్తి స్పష్టత**

టెట్ అర్హత మార్కుల విషయంలో వచ్చిన ఆరోపణలపై విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా వివరణ ఇచ్చారు. కర్నూలుకు చెందిన అభ్యర్థి ప్రభాకర్ (బీసీ) టెట్‌లో 77 మార్కులు సాధించి అర్హత పొందారని, దీనిపై మరింత స్పష్టత కోసం సెప్టెంబర్ 5న త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు.


అదేవిధంగా, జంపాల ఉష (బీసీ) 2012లోనే టెట్‌లో 80 మార్కులతో అర్హత సాధించారని, అప్పట్లో లాంగ్వేజ్ పండిట్లకు ప్రత్యేక టెట్ లేదని, ఆ సర్టిఫికెట్ చెల్లుబాటు అవుతుందని స్పష్టం చేశారు. మిగిలిన అభ్యర్థుల అర్హతలు కూడా నిబంధనల ప్రకారమే ఉన్నాయని వెల్లడించారు. ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ల జారీ రెవెన్యూ శాఖ పరిధిలోని అంశమని, అనుమానం ఉన్న సర్టిఫికెట్లను పునఃపరిశీలన కోసం జిల్లా కలెక్టర్లకు పంపామని తెలిపారు.

# అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ బిగ్ ఫైట్..











**హైదరాబాద్, సెప్టెంబరు 7(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ అసెంబ్లీ వద్ద సోమవారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో నినాదాలు రాసిన నల్ల టీషర్టులు ధరించి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు గేటు వద్దే అడ్డుకోవడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. ఉదయం గన్‌పార్క్ నుంచి ర్యాలీగా అసెంబ్లీ గేటు వద్దకు నల్ల టీషర్టులు ధరించి ప్లకార్డులతో వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు లోపలికి వెళ్లేందుకు యత్నించారు. అయితే వారిని పోలీసులు అడ్డుకోగా.. వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో నేతలు రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో ఎక్కడికక్కడా వాహనాలు నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. అయితే టీషర్ట్ విప్పి లోపలికి వెళ్తామని మాజీ మంత్రి హరీశ్ రావుతోపాటు పలువురు నేతలు టీషర్టులు తీసేశారు. బనియన్ పైనే లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయినా పోలీసులు వారిని అడ్డుకోవడంతో తీవ్ర గందరళగోళం నెలకొంది. పెద్దఎత్తున మోహరించిన పోలీసులు, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు సహా పలువురు ప్రజాప్రతినిధులను అరెస్టు చేశారు. అసెంబ్లీ గేటు వద్ద జరిగిన తోపులాటలో హరీశ్ రావు, జగదీశ్‌రెడ్డి కింద పడిపోయారు. కేటీఆర్ తో పాటు పలువురు నేతలను పోలీసులు అరెస్టు చేసే క్రమంలో వారికి గాయాలయ్యాయని తెలిసింది. అరెస్టు అనంతరం నేతలను తెలంగాణ భవన్‌కు తరలించారు.

ఇదిలావుండగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి చీరను పోలీసులు లాగారంటూ బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. అలాగే, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి జుట్టు పట్టుకుని నెట్టారంటూ ఆరోపించారు. పోలీసుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలిసిన వెంటనే హైదరాబాద్ సీపీ సజ్జనార్ అసెంబ్లీ వద్దకు చేరుకున్నారు. మహిళా ఎమ్మెల్యే చీర లాగిన అంశంపై పోలీస్ సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇదే అంశంపై ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి స్పందించారు. అసెంబ్లీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బ్లాక్ టీషర్ట్‌లు వేసుకురావడం నేరం కాదని, అయితే వాటిపైన అభ్యంతకర పదాలు ఉండటంతో లోపలికి అనుమతించలేదని వివరించారు. తాము ఎవ్వరితోనూ అసభ్యకరంగా ప్రవర్తించలేదన్నారు. అలాంటిది ఏమైనా ఉంటే వీడియోలు చూసి పరిశీలిస్తామని చెప్పారు. బీఆర్ఎస్ ఆరోపణలను పరిశీలిస్తామన్నారు. అసెంబ్లీ స్పీకర్ సూచన మేరకు తాము నడుచుకుంటున్నట్టు డీసీపీ చెప్పారు.

**అడ్డగోలు హామీలతో అధికారంలోకి కాంగ్రెస్ : కేటీఆర్, హరీశ్‌రావు**

కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. గన్‌పార్క్ వద్ద మీడియాతో మాట్లాడుతూ.. అడ్డగోలు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, సబండ వర్గాలను మోసం చేసిందని విమర్శించారు. వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని 420 హామీలు ఇచ్చారని తెలిపారు. ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని రకాలుగా సభలో అవమానించినా ప్రజల కోసం హామీల అమలుపై ప్రశ్నించాలని తమ అధినేత సూచించినట్టు తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ కుట్రలు కొత్త కాదని, గతంలో ఎన్నో చూశామన్నారు. 22 ఏ ద్వారా ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టిన ఈ ప్రభుత్వాన్ని ప్రజలే నిషేధిస్తారని హెచ్చరించారు సీఎం, మంత్రుల బంధువులకు అక్రమంగా భూ కేటాయింపులు చేస్తున్నారని ఆరోపించారు. గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్థూపానికి నివాళులర్పించిన అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీకి ర్యాలీగా బయలుదేరారు.

# రాష్ట్రానికి మూడో ప్రత్యామ్నాయం

**మొదటి పేజీ తరువాయి**

ప్రత్యామ్నాయం ఎంతో అవసరమని, ఈ విషయాన్ని ప్రజలకు వివరిస్తానని ఆయన తెలిపారు. విజయవాడలో సోమవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు.ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలకు ప్రజా సమస్యలను పట్టించుకునే పరిస్థితి లేదని విజయసాయిరెడ్డి విమర్శించారు. ముఖ్యంగా రాష్ట్ర రాజకీయం మొత్తం రెండు పార్టీల చుట్టూనే తిరుగుతోందని, వైసీపీ, టీడీపీల మధ్య ఫ్యాక్షన్ తరహా యుద్ధం జరుగుతోందని ఆరోపించారు. ఈ పార్టీలకు పోలీసులు కూడా మద్దతు ఇస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు.టీడీపీ, వైసీపీలు ఫ్యాక్షన్ కుటుంబ రాజకీయ పార్టీలని విజయసాయిరెడ్డి అభివర్ణించారు. ఆరు కోట్ల ప్రజానీకం, రాష్ట్ర సంపదను ఏ పార్టీ దోచుకోవాలనే హక్కు కోసం ఈ రెండు పార్టీలు పోటీ పడుతున్నాయని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. "ప్రజలకు గోరంత, తమకు కొండంత" అన్నట్లుగా ఈ పార్టీల తీరు ఉందని, అందుకే రాష్ట్రానికి మరో రాజకీయ ప్రత్యామ్నాయం అవసరమని ఆయన నొక్కి చెప్పారు."అమరావతిని రాజధానిగా ఒప్పుకోవడానికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు.. మనకు ఇష్టమున్నా లేకున్నా అమరావతిని రాష్ట్ర రాజధానిగా అంగీకరించి తీరాల్సిందే" అని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో సరికొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించిన ఆయన... భవిష్యత్ కార్యాచరణపై మీడియాతో మాట్లాడుతూ పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పి అభివృద్ధి సాధించడమే తమ లక్ష్యమని.. ఏపీని రూ. 12 లక్షల కోట్ల అప్పుల ఊబి నుంచి బయటపడేసేందుకే తమ కొత్త పార్టీ ఉద్భవిస్తోందని స్పష్టం చేశారు.

కేవలం రెడ్డి, కమ్మ సామాజిక వర్గాల వారే సీఎం స్థానంలో ఉండాలా? ఆయన ప్రశ్నించారు. బీసీలతో సహా అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తామని... తమ పార్టీలో ఏకంగా 66 శాతం ప్రాధాన్యత యువతకే ఇస్తామని హామీ ఇచ్చారు.

# కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

**మొదటి పేజీ తరువాయి**

పరిశీలించి బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు.

రవీంద్రభారతిలో నేడు రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవస్థ మొత్తం సిద్ధమవుతోందని అన్నారు. అందుకే ఎస్ఐఆర్ పేరుతో కొత్త కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. తెలంగాణలో కోటి ఓట్లు తొలగిస్తున్నా బీఆర్ఎస్ స్పందించడం లేదని మండిపడ్డారు.

**కొడంగల్‌లో 81 వేల ఓట్లు:** తన నియోజకవర్గం కొడంగల్‌లో వలస వెళ్లిన వేలాది మంది పేదల ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొడంగల్‌లో 81 వేల ఓట్లను అనామలీస్ జాబితాలో చేర్చారని తెలిపారు. ప్రస్తుత ఓట్లతోనే 2029లో మోదీ ఓటమికి పునాది పడుతుందని అన్నారు.

బీజేపీ వ్యతిరేక ఓట్లు అంటే మైనార్టీలవే అనుకోవద్దని సీఎం చెప్పారు. పేదలు, గిరిజనుల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో లౌకిక శక్తులు ఏకమై మోదీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

**సారంపల్లి సేవలు చిరస్మరణీయం:** రైతుల కోసం జీవితాన్ని అంకితం చేసిన సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతాంగానికి తీరని లోటని సీఎం అన్నారు. రైతు సమస్యలపై అవగాహన ఉన్న నాయకత్వం క్రమంగా తగ్గుతోందని పేర్కొన్నారు. కౌలు రైతులు, గిట్టుబాటు ధరలు సహా అనేక రైతు సమస్యలపై సారంపల్లికి అపారమైన అవగాహన ఉందని కొనియాడారు.కమ్యూనిస్టు ఉద్యమాల పోరాటాల వల్లే కాంగ్రెస్ పలు చట్టాలు తీసుకొచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. కార్మికులు, పేదల సమస్యలపై కమ్యూనిస్టులు చేసిన పోరాటాలు తమ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడ్డాయని చెప్పారు.

# ఇది దుశ్శాసన సభ..

**మొదటి పేజీ తరువాయి**

మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి 1000 రోజులుగా పాలన సాగిస్తోందని, దీనిపై శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తే తమపై ఉక్కుపాదం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో నిరసన తెలిపినట్లే తాము కూడా నిరసన తెలిపేందుకు యత్నించామని, తాము ఎలాంటి అన్‌పార్లమెంటరీ, నికృష్టమైన భాష మాట్లాడలేదని స్పష్టం చేశారు.గతంలో వైఎస్సార్, కిరణ్‌కుమార్ రెడ్డి కేబినెట్లలో మంత్రులుగా, మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన అత్యంత అనుభవజ్ఞురాళ్లు, సౌమ్యులైన సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు దారుణం అంటూ కేటీఆర్ తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. "ఒకవైపు రాహుల్ గాంధీ ఢిల్లీలో 'స్మాష్ ది పాట్రియార్కీ' అంటూ మహిళా సాధికారతపై గొప్పలు చెప్తారు. కానీ ఇక్కడ రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి రాకముందే మంత్రులుగా పనిచేసిన సీనియర్ మహిళా నేతల జుట్టు పట్టుకుని, గొంతు పిసికే ప్రయత్నం చేశారు" అని నిలదీశారు.పోలీసులు సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకుని లాగుతుంటే... కోవ లక్ష్మి అడ్డుకోకపోయి ఉంటే తీవ్ర ప్రమాదం జరిగి ఉండేదని, ఈ ఘటనతో సునీతమ్మ కంటనీరు పెట్టుకోవడం చూస్తే ఇది శాసనసభలా కాకుండా దుశ్శాసన సభలా మారిందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీనియర్ నాయకురాళ్ల పట్ల జరిగిన ఈ దాడి, అనాగరిక ప్రవర్తన వెనుక స్పష్టంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర ఉందే తప్ప మరొకటి కాదని కేటీఆర్ ఆరోపించారు.

# గణేష్ మండపాల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

**భద్రత, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి -ఎస్‌హెచ్ఓ అనుముల శ్రీనివాస్**



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో సెప్టెంబరు 7 (జర్నలిస్ట్ వార్త):**ధర్మసాగర్ మండల పరిధిలో గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు పోలీసుశాఖకు సహకరించాలని ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ అనుముల శ్రీనివాస్ కోరారు. మండపాలు ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు తమ మండపానికి సంబంధించిన పూర్తి వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.గణేష్ మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, నిర్వాహకుల వివరాలు తదితర సమాచారాన్ని పోలీసుశాఖకు అందుబాటులో ఉండేలా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మండపాల వద్ద భద్రతా చర్యలు చేపట్టడంతోపాటు విద్యుత్ కనెక్షన్లు, లైటింగ్ తదితర అంశాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని, పోలీసుశాఖ సూచనలు పాటిస్తూ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని ఎస్‌హెచ్‌ఓ అనుముల శ్రీనివాస్ తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

**ఆన్‌లైన్ నమోదు సైట్:**గణేష్ మండపాల వివరాల నమోదు కోసం తెలంగాణ పోలీస్ శాఖ వెబ్‌సైట్‌ను వినియోగించుకోవాలని సూచించారు.

**తెలంగాణ పోలీస్ పోర్టల్ ఆన్‌లైన్ నమోదు**

నమోదుకు సంబంధించి ఏవైనా సందేహాలు లేదా సహాయం అవసరమైతే ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్‌ను 8712685010 నంబర్‌లో సంప్రదించవచ్చని ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

# మండల స్థాయి క్రీడలను ప్రారంభించిన సర్పంచ్ శాంతికిషన్ నాయక్.



**బయ్యారం/,సెప్టెంబర్ 7.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండల కేంద్రంలోని జెడ్పి హెచ్ఎస్ పాఠశాలలో రెండు రోజులు జరిగే బయ్యారం మండల స్థాయి క్రీడా పోటీలను బయ్యారం సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి సర్పంచ్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి తొడ్పడతాయని,మండల స్థాయి క్రీడల్లో మంచి నైపుణ్యం సాధించి జిల్లా స్థాయి,రాష్ట్ర స్థాయి పోటిల్లో బయ్యారం మండలానికి,తల్లితండ్రులకి,పాఠశాలకు మంచి పేరుప్రతిష్టలు తెచ్చేవిధంగా క్రీడా నైపుణ్యం ప్రదర్శించాలని సర్పంచ్ ఆకాక్షించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఏనుగుల ఉమా,ఎంఈఓ లక్ష్మణ్ రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధనుంజయ, ఉపాధ్యాయులు,పిఈటీలు,నాయిని శ్రీనివాస్ రెడ్డి,నందగిరి భద్రయ్య,నందిపాటి బవాణి,బీరెడ్డి శ్రీనివాస్,ఏనుగుల రంజిత్,తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం చలో అసెంబ్లీకి పిలుపు

**దర్మసాగర్‌లో బీజేపీ నేతల ముందస్తు అరెస్టు**



**దర్మసాగర్ /హనుమకొండ బ్యూరో సెప్టెంబర్ 7 (జర్నలిస్ట్ వార్త):** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పిలుపునిచ్చిన చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లకుండా దర్మసాగర్‌లో పలువురు బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో లక్షలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు.అరెస్టయిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు బైరపాక కుమార్, జిల్లా నాయకుడు గాజుల సంపత్, మండల ప్రధాన కార్యదర్శులు బచ్చు శివప్రసాద్‌రెడ్డి, సాయం సందీప్ తదితరులు ఉన్నారు.

# నేడు ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదినం సందర్బంగా అన్నదానం.



**బయ్యారం/,సెప్టెంబర్ 7.(జర్నలిస్ట్ వార్త)**
ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదిన వేడుకల సందర్భంగా కొత్తపేట సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ అన్నదాన కార్యక్రమానికి అభిమానులు,నాయకులు,పార్టీ శ్రేణులు అధికసంఖ్యలో పాల్గొని ఈ అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ మండల ప్రజలను కోరారు.

# రుద్ర టీ హబ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న బయ్యారం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు.



**బయ్యారం/,సెప్టెంబర్ 7.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలం జగ్గుతండా పంచాయతీ పరిధిలో మారుతీ సుజుకి కార్ షోరూం పక్కన అడిదేల ఆశాదేవి, సత్యనారాయణ రెడ్డి దంపతులు నూతనముగా ఏర్పాటుచేసిన రుద్ర టీ హబ్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా బయ్యారం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సంకపల్లి సుమన్ రెడ్డి,తిరుమల ప్రభాకర్ రెడ్డి,సూరం సుధాకర్ రెడ్డి,నాయిని ఇంద్రా రెడ్డి,తమ్మిశెట్టి వెంకటపతి హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సుమన్ రెడ్డి మాట్లాడుతూ యువత ప్రభుత్వ ఉద్యోగాలపై ఆధారపడకుండా వ్యాపార రంగాలలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని,అలాగే మరికొందరికి ఉపాధి కల్పించాలని,యువత స్వయం ఉపాధి ద్వారా దేశాభివృద్ధి తోడ్పడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

# నారాయణగిరికి తెలంగాణ పబ్లిక్ స్కూల్

**రూ.10 కోట్లతో కార్పొరేట్ స్థాయి వసతులు.. సీఎం రేవంత్‌కు కడియం కృతజ్ఞతలు**



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో సెప్టెంబర్ 7 (జర్నలిస్ట్ వార్త):** స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ కేటాయించడంపై ఎమ్మెల్యే, మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి హర్షం వ్యక్తం చేశారు. ధర్మసాగర్ మండలం నారాయణగిరి ప్రభుత్వ పాఠశాలను తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా ఎంపిక చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.
సుమారు రూ.10 కోట్లతో నారాయణగిరి పాఠశాలను కార్పొరేట్ స్థాయి వసతులతో అభివృద్ధి చేయనున్నట్లు కడియం శ్రీహరి తెలిపారు. ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే ప్రాంగణంలో నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని చెప్పారు. నియోజకవర్గంలో అధికంగా ఉన్న పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఉచితంగా ఆధునిక సౌకర్యాలతో నాణ్యమైన విద్య అందించేందుకు ఈ పాఠశాల ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.
గ్రామీణ విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అన్ని ఆధునిక సదుపాయాలతో విద్యనభ్యసించే అవకాశం కలుగుతుందని అన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ కేటాయింపు నియోజకవర్గ విద్యారంగంలో కీలక మార్పునకు నాంది అవుతుందని కడియం శ్రీహరి పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలు, విద్యార్థుల తరఫున సీఎం రేవంత్‌రెడ్డికి మరోసారి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# రుద్ర టీ హబ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న జగ్గుతండా గ్రామ సర్పంచ్.






**బయ్యారం/,సెప్టెంబర్ 7.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండల కేంద్రంలోని జగ్గుతండా గ్రామపంచాయతీ పరిధిలో నూతన టీ, కాఫి షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జగ్గుతండా గ్రామపంచాయతీ సర్పంచ్ బొల్లి జయంతి వెంకటకృష్ణ ముఖ్య అతిధిగా హాజరయ్యారు.టీ హబ్ ప్రోప్రేటర్ అడిదల ఆశదేవితో కలిసి పూజ కార్యక్రమంలా పాల్గొని భక్తిశ్రద్ధలతో దేవుని పూజించి ఆ దేవుని ఆశీస్సులతో ఆశదేవి టీ హబ్ షాప్ అభివృద్ధి చెందాలని బొల్లి జయంతి వెంకటకృష్ణ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుంజ వీరస్వామి,వార్డు సభ్యులు కంద్రాతి యాకేష్,మక్కల దుర్గారావు,దేరంగుల సమ్మయ్య,షేక్ సైదులు,గుర్రం సాయి తదితరులు పాల్గొన్నారు.

# పట్టు సాగుతో రైతుల ఆదాయం పెంచుకోవాలి

**ఆధునిక పద్ధతులతో అధిక లాభాలు.. రైతులు ముందుకు రావాలి -శాస్త్రవేత్త డాక్టర్ వజ్రమ్మ**






**వేలేరు/హనుమకొండ బ్యూరో సెప్టెంబర్ 7 (జర్నలిస్ట్ వార్త):** పట్టు సాగును వదిలేయకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం సాధించే దిశగా రైతులు ముందుకు రావాలని సీబీఎస్‌సీఎస్‌ఆర్‌టీఐ, మైసూరు శాస్త్రవేత్త డాక్టర్ వజ్రమ్మ పిలుపునిచ్చారు. సంప్రదాయంగా పట్టు సాగుకు పేరుగాంచిన వేలేరు ప్రాంతంలో మళ్లీ పట్టు పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకురావాల్సిన బాధ్యత రైతులపైనే ఉందన్నారు.కమ్మరిపేట గ్రామంలో సోమవారం కేంద్ర పట్టు మండలి, తెలంగాణ రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మేరా రేశంమేరా అభిమాన్ (ఎంఆర్‌ఎంఏ) 2.0' అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పట్టు సాగు పట్ల రైతుల్లో ఉన్న అపోహలను తొలగించి, శాస్త్రీయ పద్ధతులతో సాగు చేస్తే తక్కువ విస్తీర్ణంలోనూ మెరుగైన ఆదాయం పొందవచ్చని వివరించారు.పట్టు సాగులో నాణ్యమైన మల్బరీ మొక్కల ఎంపిక నుంచి పురుగుల పెంపకం, వ్యాధుల నియంత్రణ, బెడ్ నిర్వహణ, కోకూన్ల నాణ్యత పెంపు వరకు ప్రతి దశలో ఆధునిక పద్ధతులు పాటించాలని సూచించారు. మార్కెట్ అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే పట్టు సాగు రైతులకు స్థిరమైన ఆదాయ వనరుగా మారుతుందని తెలిపారు.ఇతర పంటల మాదిరిగా పట్టు సాగును కూడా ఒక వ్యాపారంగా చూడాలి. శాస్త్రీయ పద్ధతులు పాటిస్తే నష్టాలు తగ్గి లాభాలు పెరుగుతాయి. వేలేరు ప్రాంత రైతులు మళ్లీ పట్టు సాగు వైపు అడుగులు వేయాలి. యువత కూడా ఈ రంగంలోకి రావాలి" అని డాక్టర్ వజ్రమ్మ రైతులను ఉద్దేశించి అన్నారు.కార్యక్రమంలో సుమారు 100 మంది రైతులు పాల్గొనగా 30 మంది రైతులు పట్టు సాగు చేపట్టేందుకు ముందుకు రావడం విశేషంగా నిలిచింది. రైతులకు ప్రభుత్వ పథకాలు, ప్రోత్సాహకాలు, సాంకేతిక



సహకారం, ఉపాధి అవకాశాలపై అధికారులు వివరించారు.కమ్మరిపేట సర్పంచ్ కిరణ్, జిల్లా నోడల్ అధికారులు సంజీవ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, పట్టు పరిశ్రమ శాఖ అధికారి మల్లయ్యతో పాటు పలువురు అధికారులు, ప్రగతిశీల రైతులు, మహిళా రైతులు, యువత పాల్గొన్నారు. వేలేరు ప్రాంతంలో పట్టు సాగును పునరుద్ధరించేందుకు ఎంఆర్‌ఎంఏ 2.0 కార్యక్రమం కీలకంగా మారుతుందని అధికారులు పేర్కొన్నారు.

# నూతన రామాలయం నిర్మాణానికి ముందడుగు..



**బయ్యారం/,సెప్టెంబర్ 7.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మండలం కొత్తపేట గ్రామపంచాయతీ ప ంఖ్తుఅరిధిలోని నూతన రామాలయ నిర్మాణానికి మరో ముందడుగు పడింది.కొత్తపేట గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు,భక్తులు సమక్షంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఎండోమెంట్ శాఖ అధికారి శివశంకర్ కొత్తపేట గంధంపల్లి రామాలయాన్ని సోమవారం సందర్శించి నూతన సీత రామచంద్ర స్వామి దేవాలయ నిర్మాణం కోసం అధికారిక కొలతలు,నిర్మాణ పనులకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఎండోమెంట్ అధికారులు తెలిపారని సర్పంచ్ ప్రవీణ్ నాయక్ తెలిపారు.ఈ కార్యక్రమం గ్రామస్తులు,గ్రామపంచాయతీ పాలకవర్గ ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

## ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం



**కేయూ క్యాంపస్/ సెప్టెంబరు 7 (జర్నలిస్ట్ వార్త):** విద్యారంగ సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కేయూ జంక్షన్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్ మాట్లాడుతూ మంత్రివర్గ విస్తరణలో విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని కేటాయించి, విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.
పాలిటెక్నిక్ విద్యార్థులకు నష్టం కలిగించే జీవో నెం.97ను వెంటనే రద్దు చేయాలని, ఇంటర్మీడియట్ విద్యను రద్దు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కోరారు. విద్యార్థుల ఫీజు బకాయిలు, సంక్షేమ హాస్టళ్ల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజుల వసూళ్లకు అడ్డుకట్ట వేసేందుకు ఫీజు నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడతామని సంతోష్ హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి ప్రణీత్‌గౌడ్, ఉపాధ్యక్షులు జక్కుల భానుప్రసాద్, శ్రీపతి వినయ్, కౌన్సిల్ సభ్యులు అజయ్, శ్రీజ, సురేష్, రాహుల్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ హౌస్ అరెస్టులతో గొంతు నొక్కలేరు

## బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి

**నర్సంపేట/సెప్టెంబర్ 7 (జర్నలిస్ట్ వార్త):**




ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలను అక్రమంగా హౌస్ అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు పిలుపు మేరకు చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు తనతో పాటు నర్సంపేట నియోజకవర్గ బీజేపీ నాయకులను హౌస్ అరెస్టు చేయడాన్ని ఖండించారు. 1975 ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర తమదని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన నిరసన హక్కును ప్రభుత్వం కాలరాయడం సరికాదన్నారు. పోలీసులతో అక్రమ నిర్బంధాలు చేయవచ్చేమో కానీ ప్రజా సమస్యలపై బీజేపీ చేస్తున్న పోరాటాన్ని మాత్రం అడ్డుకోలేరని స్పష్టం చేశారు.

# హెల్త్ కేర్ కోర్సుపై అవగాహన



**నర్సంపేట/సెప్టెంబర్ 7 (జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), నర్సంపేటలో విద్యార్థులకు హెల్త్ కేర్ రంగంలోని విద్యా, ఉపాధి అవకాశాలపై సోమవారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. పింగళి మహిళా ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల హనుమకొండ మైక్రోబయాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ జి. రేణుక ముఖ్య వక్తగా పాల్గొని కోర్సు లక్ష్యాలు, శిక్షణ, ప్రాక్టికల్ నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ రంగం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో శిక్షణ పొందిన యువతకు విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సాధారణ డిగ్రీతోపాటు నైపుణ్య ఆధారిత కోర్సులు అభ్యసించడం ద్వారా ఉద్యోగ అవకాశాలను మెరుగుపరుచుకోవచ్చన్నారు. హెల్త్ కేర్ రంగంలో సేవాభావం, క్రమశిక్షణ, సమయపాలన, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, పరిశుభ్రతపై అవగాహన అవసరమని రేణుక వివరించారు. కార్యక్రమంలో బోటనీ విభాగాధిపతి డా. రాంబాబు, జువాలజీ విభాగం అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు.. ఎమ్మెల్సీపై చర్యలు తీసుకోవాలి

## మాదిగ హక్కుల దండోరా జిల్లా అధ్యక్షుడు పుల్లూరి కుమార్ మాదిగ డిమాండ్

**జమ్మికుంట/సెప్టెంబరు 7 (జర్నలిస్ట్ వార్త):**



తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి కుమార్ మాదిగ అన్నారు. ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అధిష్ఠానం వెంటనే క్షమాపణ చెప్పడంతో పాటు ఎమ్మెల్సీ తాతా మధుపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా ఉన్న సమయంలో ఆయనపై ఈ విధంగా వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. దళిత ముఖ్యమంత్రిని చేస్తామని హామీ ఇచ్చి పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నేతలు. ఇప్పుడు అదే దళిత వర్గానికి చెందిన వ్యక్తి స్పీకర్‌గా ఉండటాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన ప్రజాప్రతినిధులు సభ వెలుపల వ్యక్తిగత దూషణలకు దిగడం ప్రజాస్వామ్యానికి చీకటి రోజని అన్నారు. తాతా మధుపై వెంటనే చర్యలు తీసుకోకపోతే తెలంగాణ మాదిగ హక్కుల దండోరా ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులను అడ్డుకుంటామని పుల్లూరి కుమార్ మాదిగ హెచ్చరించారు.

# తల్లాడలో సమైక్య భవనాలకు శంకుస్థాపన




**తల్లాడ/ సెప్టెంబర్ 7 (జర్నలిస్ట్ వార్త):**
తల్లాడ గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామ సమైక్య భవనాల నిర్మాణానికి సోమవారం సర్పంచ్ పెరిక నాగేశ్వరావు శంకుస్థాపన చేశారు. గ్రామీణ మహిళా సంఘాలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ఆరు భవనాల నిర్మాణానికి రూ.60 లక్షలు మంజూరు చేసింది. వీటిలో తల్లాడలో నాలుగు, నారాయణపురంలో రెండు భవనాలు నిర్మించనున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళా సంఘాల సమావేశాలు, పొదుపు, రుణాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలకు సమైక్య భవనాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో నిర్మాణాలు పూర్తి చేస్తామని తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు మరింత సహకారం అందిస్తామని పేర్కొన్నారు.
కార్యక్రమంలో ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి, ఎంపీడీవో అంబటి శ్రీధర్‌రాజు, ఏపీఎం రవికుమార్, ఏపీవో కోటయ్య, పంచాయతీరాజ్ ఇంజనీర్ కార్తీక్, ఈవో శ్రీహరికృష్ణ, ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా వార్డు సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# హౌస్ అరెస్టులతో ప్రజాస్వామ్య గొంతును అణచలేరు

## బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి



**సత్తుపల్లి/సెప్టెంబర్ 7 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణలో ప్రజాస్వామ్య నిరసనలను హౌస్ అరెస్టులు, ముందస్తు నిర్బంధాలతో అణచివేయడం సరికాదని బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. చలో అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొనకుండా బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలను పోలీసులు ఉదయమే వారి ఇళ్ల వద్ద అదుపులోకి తీసుకోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్రవ్యాప్తంగా ముందస్తుగా అదుపులోకి తీసుకున్న బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలందరినీ ఎలాంటి షరతులు లేకుండా వెంటనే విడుదల చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు, 22ఏ తదితర ప్రజా సమస్యలపై ప్రశ్నించడం ప్రతిపక్షాల హక్కే కాకుండా ప్రజాస్వామ్య బాధ్యత కూడా అని పేర్కొన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం కాలరాయకూడదన్నారు. ఢిల్లీలో ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే కాంగ్రెస్ నాయకత్వం తెలంగాణలో జరుగుతున్న ముందస్తు నిర్బంధాలపై ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. అరెస్టులతో ప్రజల గొంతును అణచలేరని, ప్రజాస్వామ్య హక్కులను ప్రభుత్వం గౌరవించాలని పొంగులేటి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు

# కాంగ్రెస్ 6 గ్యారెంటీలు.. 420 హామీలు అమలు చేయాలి

## కేసముద్రం బీఆర్ఎస్ డిమాండ్



**కేసముద్రం/ సెప్టెంబర్ 7 (జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను తక్షణమే అమలు చేయాలని కేసముద్రం మండల బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆరోపించారు. నాణ్యమైన విద్యుత్, మెరుగైన వైద్య సేవలు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులు, ప్రజాప్రతినిధులపై పోలీసు చర్యలకు దిగడం అప్రజాస్వామికమన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహమ్మద్ నజీర్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి కమటం శ్రీనివాస్, మోడం రవీందర్ గౌడ్, ఊకంటి యాకుబ్ రెడ్డి, ఎర్పుల కుమార్ స్వామి, కౌన్సిలర్ రావుల వినయ్ రెడ్డి, సర్పంచ్ ఈసం లక్ష్మీనారాయణ, తారా సింగ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్‌పై తాతా మధు వ్యాఖ్యలు ఖండనీయం

## మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు కోడం రజిత



**ఇల్లంతకుంట/ సెప్టెంబర్ 7 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఇల్లంతకుంట మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు కోడం రజిత తీవ్రంగా ఖండించారు. స్పీకర్ పదవి ఏ ఒక్క పార్టీకి, వ్యక్తికి సంబంధించినది కాదని, అది శాసనసభ గౌరవానికి, ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతీక అని పేర్కొన్నారు.
రాజకీయ విభేదాలు సహజమేనని, అయితే రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న స్పీకర్‌ను కించపరిచేలా వ్యక్తిగత దూషణలు, అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. స్పీకర్‌ను అవమానించడం అంటే శాసనసభ గౌరవాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని అన్నారు. తాతా మధు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని, తెలంగాణ శాసనసభ స్పీకర్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కోడం రజిత డిమాండ్ చేశారు

# నూతన గృహ దర్వాజా పూజలో మున్సిపల్ చైర్‌పర్సన్



**కేసముద్రం/సెప్టెంబర్ 7 (జర్నలిస్ట్ వార్త):**
కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు బోడతండాలో సోమవారం నిర్వహించిన నూతన గృహ దర్వాజా పూజ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బానోత్ సుమన్‌అనిత దంపతులు నిర్మించుకుంటున్న నూతన గృహంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలిపిన చైర్‌పర్సన్. నూతన గృహంలో కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బోడ మోతిలాల్, బానోత్ సింహాద్రి, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# తాతా మధు వ్యాఖ్యలు ఖండించిన వీరారెడ్డి



**తల్లాడ/సెప్టెంబర్ 7 (జర్నలిస్ట్ వార్త):**
దళిత స్పీకర్‌ను ఉద్దేశించి ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత, అభ్యంతరకర వ్యాఖ్యలను వైరా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దున్నేటి వీరారెడ్డి తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారు సంయమనం, బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.
దళిత సమాజం ఆత్మగౌరవాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని, ఇలాంటి వ్యాఖ్యలు సామాజిక సామరస్యానికి విఘాతం కలిగిస్తాయని వీరారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాతా మధు వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, దళిత సమాజానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# దామెరలో మార్కెట్ జోరు

## ఊపందుకున్న కూరగాయల సంత.. సంతోషంలో విక్రేతలు



**ఎల్కతుర్తి/సెప్టెంబరు 7 (జర్నలిస్ట్ వార్త):**

ఎల్కతుర్తి మండలం దామెర గ్రామంలో కూరగాయల సంత రెండో రోజు జోరుగా కొనసాగింది. గత ఆదివారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంతకు తొలిరోజే విశేష స్పందన లభించగా.. రెండో రోజు కూడా కొనుగోలుదారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భీమదేవరపల్లి, అక్కనపేట, కన్నారం, మల్లారం, కొత్తకొండ, నర్సింగాపూర్, బుల్లోనిపల్లి తదితర గ్రామాల నుంచి రైతులు నేరుగా పంట పొలాల నుంచి కూరగాయలు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. దీంతో తాజా కూరగాయలు అందుబాటులో ఉండటంతోపాటు తక్కువ ధరలకు లభిస్తుండటంపై కొనుగోలుదారులు సంతోషం వ్యక్తం చేశారు. సంత గురించి సమీపంలోని మరికొన్ని గ్రామాల ప్రజలకు పూర్తిస్థాయిలో సమాచారం లేకపోవడం బాధాకరమని పలువురు పేర్కొన్నారు. దామెర సంతను మరింత విస్తరించి కూరగాయలతోపాటు చేపలు, ఎండు చేపలు, పచ్చళు ,, ఉప్పు చేపలు, బట్టలు, చెప్పులు, చీపురు కట్టలు తదితర నిత్యావసర వస్తువులు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

### ధరల్లో వ్యత్యాసాలపై దృష్టి పెట్టాలి

రైతులు నేరుగా మార్కెట్‌కు కూరగాయలు తీసుకొచ్చి విక్రయిస్తున్నప్పటికీ. ఒక్కో దుకాణం వద్ద ఒక్కో రకమైన ధరలు ఉండటంపై కొందరు రైతులు, కొనుగోలుదారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ధరల విషయంలో గ్రామపంచాయతీ సిబ్బంది, కార్యదర్శి పర్యవేక్షణ చేపట్టాలని కోరారు. దామెర సంతకు సోమదేవరపల్లి, చింతలపల్లి, తెలంగాణపల్లి, కొత్తపల్లి, ఇంద్రనగర్, గోపాల్‌పూర్, ధర్మసాగర్ ప్రాంతాల నుంచి కూడా కొనుగోలుదారులు వస్తుండటంతో మార్కెట్‌కు ఆదరణ పెరుగుతోంది

# పన్ను బకాయిలు చెల్లించాకే వాహనాన్ని స్క్రాప్‌కు ఇవ్వాలి

### జిల్లా రవాణా శాఖ అధికారి శంకర్ నాయక్



**మహబూబాబాద్/ సెప్టెంబరు 7 (జర్నలిస్ట్ వార్త):** వాహనాలను తుక్కు (స్క్రాప్)గా విక్రయించే ముందు రవాణా శాఖ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా రవాణా శాఖ అధికారి శంకర్ నాయక్ సూచించారు. ముఖ్యంగా బస్సులు, లారీలు, ఇతర వాణిజ్య వాహనాలను స్క్రాప్‌కు ఇచ్చే ముందు ఆర్టీఏ అధికారులకు సమాచారం అందించి, అవసరమైన ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో పన్ను బకాయిలున్న వాహన యజమానులకు అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారని చెప్పారు. కొందరు యజమానులు వాహనాలను ఇప్పటికే స్క్రాప్‌గా విక్రయించామని పేర్కొంటున్నారని, అయితే వాహనాన్ని తుక్కుగా విక్రయించినంత మాత్రాన పన్ను బకాయిలు రద్దు కావని స్పష్టం చేశారు. బకాయిలు యజమాని పేరుపైనే కొనసాగుతాయని, ఆలస్యమైతే పెనాల్టీలు కూడా పడే అవకాశం ఉందన్నారు. వాహనాన్ని స్క్రాప్‌కు ఇచ్చే ముందు పన్ను బకాయిలను పూర్తిగా చెల్లించి ఆర్టీఏలో ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. మీసేవ కేంద్రాలు, ఆన్‌లైన్ పోర్టల్స్, మొబైల్ ద్వారా పన్నులు చెల్లించే అవకాశం ఉందన్నారు. మోటార్ వెహికల్స్ యాక్ట్1988లోని సెక్షన్ 55 ప్రకారం నిబంధనలు ఉల్లంఘిస్తే రిజిస్ట్రేషన్ రద్దు వంటి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహన యజమానులు ముందుగానే బకాయిలు చెల్లించి చట్టపరమైన ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని కోరారు.

# స్పీకర్‌పై వ్యాఖ్యలు.. కాంగ్రెస్ కన్నెర్ర

### తాతా మధు దిష్టిబొమ్మ దహనం



**ఐనవోలు/ సెప్టెంబరు 7(జర్నలిస్ట్ వార్త);** అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నగరకంటి మోహన్‌గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు యాకార సాంబయ్య ఆధ్వర్యంలో నంది సెంటర్ వద్ద తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేశారు. స్పీకర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేయడం దళితులను అవమానించడమేనని నాయకులు పేర్కొన్నారు. తాతా మధుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అన్ని పార్టీల నేతలపై ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ద

# నూతన గృహ ప్రవేశ వేడుకల్లో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్



**కేసముద్రం/సెప్టెంబర్ 7 (జర్నలిస్ట్ వార్త):** కేసముద్రం మున్సిపాలిటీ 14వ వార్డుకు చెందిన తెరల శ్యామ్‌స్వాతీ దంపతుల నూతన గృహ ప్రవేశ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న, వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమా నాగేశ్వర్‌రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహంలోకి అడుగుపెట్టిన శ్యామ్‌స్వాతీ దంపతులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వారు నూతన గృహంలో ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో కలకాలం జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, వార్డు ప్రజలు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు

# చింతల లింగయ్య యాదవ్‌కు టీడీపీ నేతల ఘన నివాళి



**ఖమ్మం/సెప్టెంబర్ 7 (జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం నగరంలోని టేకులపల్లిలో చింతల లింగయ్య యాదవ్ నివాసంలో జరిగిన సంతాప కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నాయకులు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా లింగయ్య యాదవ్ పార్టీకి అందించిన సేవలను నాయకులు గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి, ఖమ్మం నియోజకవర్గ బాధ్యులు కూరపాటి వెంకటేశ్వర్లు, జిల్లా అడహక్ కమిటీ సభ్యులు, పాలేరు నియోజకవర్గ బాధ్యులు కొండబాల కరుణాకర్, జిల్లా నాయకులు గుత్తా సీతయ్య, మాజీ కార్పొరేటర్ చేతుల నాగేశ్వరరావు, నగర నాయకులు గుండపనేని నాగేశ్వరరావు, రాయల కోటేశ్వరరావు, కర్ణాటి అశ్వనీకుమార్, కామినేని శ్రీనివాసరావు, నల్లమల శ్రీనివాస్, జెమ్స్, ఆత్కూరి నరేష్, పొదిల భూపతి, మల్లెంపాటి లహరిన్‌తో పాటు నగర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# డోలో మాత్రలు మింగి వృద్ధురాలి మృతి

**గీసుగొండ/ సెప్టెంబరు 7(జర్నలిస్ట్ వార్త);** మతిస్థిమితం సరిగా లేక డోలో మాత్రలు మింగి అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన గీసుగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గీసుగొండ సీఐ డి. విశ్వేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం. దస్రునాయక్ తండాకు చెందిన హలావత్ జమ్మి (50) కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేక ఇబ్బంది పడుతోంది. ఈ నెల 1న ఉదయం కుటుంబసభ్యులు నిద్రలేచి చూడగా ఆమె అపస్మారక స్థితిలో కనిపించింది. ఆమె చేతిలో ఖాళీ డోలో మాత్రల షీట్ ఉండటాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న జమ్మి ఈ నెల 6న మధ్యాహ్నం 3 గంటల సమయంలో మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి కుమారుడు హలావత్ వీరేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ విశ్వేశ్వర్ తెలిపారు.

# స్పీకర్‌ను అవమానిస్తే చర్యలు తీసుకోవాలి

### బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందంతోనే సభలో చర్చను అడ్డుకుంటున్నారు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**హసన్‌పర్తి/ సెప్టెంబర్ 7 (జర్నలిస్ట్ వార్త):** శాసనసభలో స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలపై చర్చ జరుగుతుంటే బీజేపీ ఎమ్మెల్యేలు అడ్డుకోవడం దురదృష్టకరమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. స్పీకర్ పదవిని అవమానించేలా మాట్లాడిన ఇద్దరు సభ్యుల వ్యాఖ్యలను రికార్డుల్లో పరిశీలించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సభ్యులను శాశ్వతంగా సభ నుంచి సస్పెండ్ చేయాలని, అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని కోరారు. సభా సంప్రదాయాలను కాపాడాల్సిన సభ్యులే చర్చకు అవకాశం లేకుండా అడ్డుకోవడం బాధాకరమన్నారు. బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే స్పీకర్‌కు జరిగిన అవమానంపై చర్చకు సహకరించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నాగరాజు డిమాండ్ చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందంతోనే అసలు అంశాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.

దళిత స్పీకర్‌ను అవమానించినా స్పందించకపోవడం బీజేపీ వైఖరిని స్పష్టం చేస్తోందని విమర్శించారు. బీజేపీ ఫ్యూడలిస్టు, దళిత వ్యతిరేక, మనువాద పార్టీగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన ప్రదేశాన్ని శుద్ధి చేసిన ఘటనను ప్రస్తావిస్తూ, అలాంటి సంస్కృతి ఉన్న పార్టీ ఇప్పుడు స్పీకర్ అవమానంపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. సభా వ్యవహారాల్లో స్పీకర్‌కు గౌరవం ఇవ్వడం ప్రతి సభ్యుడి బాధ్యతని, సభలో సభ్యులకు ఏదైనా ఇబ్బంది కలిగితే రక్షించాల్సిన స్పీకర్‌పైనే అనుచిత వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని నాగరాజు అన్నారు.

# వసంతరాణి దశదినకర్మకు నరుకుడు వెంకటయ్య హాజరు



**హైదరాబాద్ /సెప్టెంబరు 7(జర్నలిస్ట్ వార్త);** తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం మాతృమూర్తి వసంతరాణి దశదినకర్మ కార్యక్రమానికి వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య హాజరయ్యారు. హైదరాబాద్ చెంగిచర్లలోని నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు కందిక ఎల్లస్వామితో కలిసి వసంతరాణి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

# చలో హైదరాబాద్‌కు తరలిరావాలి


### చలో హైదరాబాద్‌కు తరలిరావాలి -10న మహాధర్నా.. టీజీఈజేఏసీ పిలుపు



**వర్ధన్నపేట/సెప్టెంబరు 7(జర్నలిస్ట్ వార్త):** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న చలో హైదరాబాద్‌మహాధర్నాను విజయవంతం చేయాలని టీజీఈజేఏసీ వరంగల్ జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. వర్ధన్నపేట ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా చైర్మన్ గాజె వేణుగోపాల్ మాట్లాడుతూ 2వ పీఆర్సీ అమలు, 51 శాతం ఫిట్‌మెంట్, పెండింగ్ డీఏల విడుదల, బకాయి బిల్లుల చెల్లింపు, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ వంటి డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి పాలకుర్తి సదానందం, కోశాధికారి అంచ కిరణ్‌కుమార్, యూటీఎఫ్ నాయకులు తాటికాయల కుమార్, సుజన్ ప్రసాద్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మధు, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్, గోవిందరావు, మహేందర్‌రెడ్డి, టీఆర్టీఎఫ్ తాళ్లపల్లి రాజు, పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు వెంకటరమణ, శంకేషి రాజేష్, కల్లెపు సదానందం, హుస్సేన్, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌ఎస్‌ఆర్ గ్రాండ్ రెస్టారెంట్ ప్రారంభం

### నాణ్యమైన ఆహారంతో ఆదరణ పొందాలి -రవీందర్‌రావు



**వర్ధన్నపేట/ సెప్టెంబరు 7(జర్నలిస్ట్ వార్త);** పట్టణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎల్‌ఎస్‌ఆర్ గ్రాండ్ ఏసీ రెస్టారెంట్ ప్రారంభోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై రెస్టారెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ.. ప్రజల అభిరుచులకు అనుగుణంగా నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. మెరుగైన సేవలతో వినియోగదారుల నమ్మకాన్ని పొందుతూ రెస్టారెంట్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రెస్టారెంట్ నిర్వాహకులు, కుటుంబ సభ్యులు, స్థానికులు, వ్యాపార ప్రముఖులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# అసెంబ్లీ అరెస్టులపై సత్తుపల్లిలో బీఆర్ఎస్ నిరసన

## సండ్ర ఆధ్వర్యంలో నల్ల జెండాలతో భారీ ర్యాలీ






**సత్తుపల్లి/ సెప్టెంబరు 7 (జర్నలిస్ట్ వార్త):** అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ సత్తుపల్లిలో ఆ పార్టీ శ్రేణులు ఆందోళన నిర్వహించాయి. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో జీవీ మాల్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు నల్ల జెండాలు, నల్ల కండువాలతో భారీ ర్యాలీ చేపట్టారు. మహిళలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అసెంబ్లీకి నల్ల దుస్తులతో వెళ్లిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం, పలువురు నేతలను అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య హక్కులను హరించడమేనని సండ్ర వెంకట వీరయ్య అన్నారు. ప్రజా సమస్యలను ప్రశ్నించడం ప్రతిపక్షం హక్కని, ప్రశ్నించే గొంతును అడ్డుకోవడం సరికాదన్నారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల వ్యవహారశైలిని ఖండించారు. హామీల అమలేది? కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తిచేసుకున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీల అమలుపై ప్రజల్లో ప్రశ్నలు ఉన్నాయని సండ్ర అన్నారు. మహిళలకు నెలకు రూ. 2,500, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్, విద్యార్థులకు స్కూటర్లు, కల్యాణలక్ష్మి-షాదీముబారక్‌లో తులం బంగారం, పేదలకు ఇళ్ల వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. అనంతరం ప్రజల నుంచి సేకరించిన సమస్యలపై వినతిపత్రాలను ప్రజావాణిలో అధికారులకు అందజేశారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం






**వర్ధన్నపేట/సెప్టెంబరు 7(జర్నలిస్ట్ వార్త);** తల్లిదండ్రులు జన్మనిస్తే.. గురువులు జీవితాన్ని తీర్చిదిద్దుతారని వర్ధన్నపేట ఎంపీడీవో వెంకటరమణ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంఈవో మామునూరి శ్రీధర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. చదువు బోధించేవారే కాకుండా సన్మార్గం చూపే ప్రతి ఒక్కరూ గురువులేనని పేర్కొన్నారు. అనంతరం మండలస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని శాలువాలు, ధ్రువీకరణ పత్రాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కాయిత శ్రీనివాస్, కృష్ణ, సీహెచ్ రమేష్, సంఘాల నాయకులు మనుచేందర్‌రెడ్డి, అశోక్, బండ రమేష్, కుసుమ కుమారస్వామి, సురేష్ గుడికందుల, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

# హామీలు అమలు చేయాలంటూ బీఆర్ఎస్ ధర్నా

## అధికారులకు వినతిపత్రాలు.. అంబేద్కర్ సెంటర్‌లో ఆందోళన



**వర్ధన్నపేట/ సెప్టెంబరు 7(జర్నలిస్ట్ వార్త);** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఇతర హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు సోమవారం వర్ధన్నపేటలో ఆందోళన నిర్వహించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ఆదేశాల మేరకు తహసీల్దార్, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి దాదాపు 1000 రోజులు గడిచినా అమలు చేయలేదని నాయకులు విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీకి రాకుండా అడ్డుకుని అరెస్టు చేయడాన్ని నిరసించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తుళ్ల కుమారస్వామి, పట్టణ అధ్యక్షుడు గోధుమల మధుసూదన్, మాజీ జెడ్పీటీసీ మార్గం బిక్షపతి, మాజీ మార్కెట్ చైర్మన్ గుజ్జ సంపత్‌రెడ్డి, కౌన్సిలర్ గుజ్జ వీరన్న, తుమ్మల శ్రీధర్, సిల్వర్ కుమారస్వామి, తిరుపతి సురేష్, సింగరమైన రాజశేఖర్, భానోత్ నవీన్, దుగ్యాల మాధవరావు, అంగోత్ బిక్షపతి, తోటకూరి రాజమణి, పూజారి రఘు, కొండేటి దేవేందర్, కొండేటి శ్రీనివాస్, పిట్టల రాజు, భూక్యా రామన్న, వసంత్ రమేష్‌నాయక్, కందుగుల నర్సయ్య, భూక్యా లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ప్రైవేట్ కాలేజీల ఆందోళన

## మంగళవారం బంద్‌కు పిలుపునిచ్చిన డిగ్రీ, పీజీ కాలేజీల సంఘం



సెప్టెంబరు 7(జర్నలిస్ట్ వార్త);

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణలోని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు మంగళవారం బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ మేరకు తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల సంఘం (టీపీడీఎంఏ) ఒక ప్రకటన విడుదల చేసింది. బంద్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల కార్యకలాపాలను నిలిపివేయనున్నట్లు యాజమాన్యాలు తెలిపాయి. పట్టణ కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహిస్తామని, ప్రభుత్వం తమ డిమాండ్లపై తక్షణమే స్పందించకపోతే భవిష్యత్తులో నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించాయి. ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో అందకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కళాశాలల యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేశాయి. సిబ్బంది వేతనాలు, భవనాల అద్దెలు, విద్యుత్ బిల్లులు వంటి నిర్వహణ ఖర్చులు కూడా చెల్లించలేని దయనీయ స్థితిలో ఉన్నామని వాపోయాయి. ఫీజు బకాయిలు సుమారు రూ. 10,000 కోట్ల వరకు పేరుకుపోయాయని ఇటీవలి కథనాలు, రాజకీయ నేతల ప్రకటనలు స్పష్టం చేస్తున్నాయి. ఇప్పటికే ఆర్థిక ఒత్తిడిని తట్టుకోలేక రాష్ట్రంలో దాదాపు 310 ప్రైవేట్ కళాశాలలు మూతపడ్డాయని ప్రతిపక్ష నాయకులు పేర్కొన్నారు. ఈ సమస్యపై గతంలో ప్రైవేట్ విద్యాసంస్థలు పలుదఫాలుగా ఆందోళనలు చేపట్టినప్పటికీ, ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పష్టమైన హామీ లభించలేదని యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. తాజా బంద్‌తో తమ నిరసనను మరింత ఉద్ధృతం చేస్తున్నట్లు వెల్లడించాయి.

# రాయలసీమకు జలధారలు

## ఉమ్మడి చిత్తూరు జిల్లా పశ్చిమ ప్రాంతానికి జేజేఎం - అమరజీవి జలధారలు

## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో తాగు నీటి సమస్యకు పరిష్కారం




**మంగళగిరి సెప్టెంబరు 7(జర్నలిస్ట్ వార్త);** అత్యంత తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో చేపట్టిన తాగు నీటి ప్రాజెక్టుల పనులు వారాంతపు లక్ష్యాలు నిర్దేశించుకుని త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ సూచించారు. ఏడాది చివరినాటికి పూర్తి చేయాల్సిన లక్ష్యాలను నెలవారీ, వారాల వారీగా విభజించుకుని, ఎప్పటికప్పుడు పూర్తికావాల్సిన పనులపై సమీక్షించుకోవాలని స్పష్టం చేశారు. తద్వారా వేగంగా నిర్మాణం పూర్తి చేసి, గడువులోపు ప్రాజెక్టును ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధారల కింద రూ. 2,370 కోట్లతో చేపట్టిన చిత్తూరు మల్టీ విలేజ్ స్కీమ్ పనుల పురోగతిపై సమీక్షించారు. ప్రాజెక్టు నిర్మాణం, పైప్‌లైన్ నిర్మాణం కోసం వివిధ శాఖల నుంచి పొందాల్సిన అనుమతులు తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి గ్రామానికి స్వచ్ఛమైన తాగునీరు అందాలి. ప్రతి గొంతు దాహార్తి తీరాలన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జల్ జీవన్ మిషన్ సంకల్పాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అమరజీవి జలధారలుగా ముందుకు తీసుకువెళ్తున్నారు. అత్యంత నీటి ఎద్దడి కలిగిన ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అడుగులు వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి, 2024తో ముగిసిన జల్ జీవన్ మిషన్ గడువును 2028 వరకు పొడిగించారు. జల్ జీవన్ మిషన్ 2.0 కింద దాదాపు రూ. 26,000 కోట్ల విలువ చేసే తాగునీటి ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్తున్నారు. అందులో మొదటి విడతగా రూ. 7,910 కోట్లతో ఐదు జిల్లాల పరిధిలో చేపట్టిన ఐదు మెగా వాటర్ గ్రిడ్ పథకాల్లో చిత్తూరు కూడా ఒకటి.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పశ్చిమ ప్రాంత ప్రజలకు శాశ్వత తాగునీటి భద్రత కల్పించేందుకు జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధార నిధులతో రూ. 2,370 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిష్ఠాత్మక తాగునీటి సరఫరా పనులు చేపట్టారు. గండికోట, వెలిగల్లు జలాశయాలను నీటి వనరులుగా వినియోగిస్తూ అమలవుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా మూడు నియోజకవర్గాల పరిధిలోని 18 మండలాల్లో ఉన్న 3,163 ఆవాసాలకు స్వచ్ఛమైన తాగు నీరు అందించనున్నారు. సుమారు 25 లక్షల మంది ప్రజలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నారు. చిత్తూరు మల్టీ విలేజ్ తాగునీటి పథకానికి సంబంధించి గండికోట వద్ద నిర్మాణం చేపట్టిన ఒక ఇంటేక్ వెల్ నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయి. నాలుగు రా వాటర్ సంపులు నిర్మించాల్సి ఉండగా, అందులో మూడు పనులు శరవేగంగా సాగుతున్నాయి. గ్రౌండ్ లెవల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల నిర్మాణం, గుర్రంకొండ వద్ద 75 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో ఒక నీటి శుద్ధి కేంద్రం, వెలిగల్లు వద్ద 26 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో మరో నీటి శుద్ధి కేంద్రం నిర్మాణ దశలో ఉన్నాయి. ఏడు నీటి సంపులు, ఐదు ఓవర్‌హెడ్ ట్యాంకులు, 14 గ్రౌండ్ లెవల్



బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు తదితర 167 పనులు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. ఇప్పటివరకు దాదాపు 130 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణం కూడా పూర్తయ్యింది. జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధారల కింద పనుల్లో నాణ్యతా లోపాలు లేకుండా దీర్ఘకాలం ప్రజలకు ఉపయోగపడేలా చేపట్టాలని కళ్యాణ్ సూచించారు.

# డీఎస్సీలో స్కామ్ జరిగింది..

## మంత్రి లోకేశ్ రాజీనామా చేసి, సీబీఐతో విచారణ జరిపించాలి: సజ్జల

**అమరావతి సెప్టెంబరు 7(జర్నలిస్ట్ వార్త);** రాష్ట్రంలో జరుగుతున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్), జిల్లా ఎంపిక కమిటీ (డీఎస్సీ) నియామక ప్రక్రియలో భారీ కుంభకోణం జరిగిందని వైసీపీ తీవ్ర ఆరోపణలు చేస్తుండడం తెలిసిందే. ఇది 'క్యాష్ ఫర్ టీచర్ పోస్ట్' స్కామ్ అని అభివర్ణించిన వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి.. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలని, ఈ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)తో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సోమవారం అమరావతిలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో టీచర్ పోస్టులను అడ్డగోలుగా అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఈ అక్రమాలపై ప్రభుత్వ పెద్దలు స్పందించకుండా, పాఠశాల విద్య కమిషనర్, శాప్ ఎండీ వంటి అధికారులతో మొక్కుబడి సమాధానాలు ఇప్పించి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (జీవో)లను మార్చడం వంటి కీలక నిర్ణయాలు ముఖ్యమంత్రి చంద్రబాబు, 'డీ ఫ్యాక్టో సీఎం'గా వ్యవహరిస్తున్న మంత్రి లోకేశ్‌కు తెలియకుండా జరగవని, కాబట్టి శాఖాపరమైన విచారణలతో ప్రయోజనం లేదని



సజ్జల స్పష్టం చేశారు. 'మెగా డీఎస్సీ' పేరుతో కొత్తగా ఉద్యోగాలు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోందని, కానీ వాస్తవానికి తమ ప్రభుత్వ హయాంలో జగన్ నోటిఫై చేసిన 6,300 పోస్టులనే ఇప్పుడు భర్తీ చేస్తున్నారని సజ్జల గుర్తుచేశారు. పారదర్శకతకు విరుద్ధంగా, ఎంపిక వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచకుండా, అభ్యర్థులకు 'వ్యక్తిగత సమాచారం' పంపి గోప్యత పాటిస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా సజ్జల పలు ఆరోపణలు చేశారు. కోచింగ్ సెంటర్ల ద్వారా 120 ప్రశ్నలను రూ. 3 లక్షలకు అమ్ముకున్నట్లు మీడియాలో కథనాలు వచ్చాయని పేర్కొన్నారు. స్పోర్ట్స్ కోటాలో చంద్ర నాయక్, సుధా రాణి, రియాజుల్లా, పావని వంటి వారు జరగని క్రీడల్లో పాల్గొన్నట్లు నకిలీ సర్టిఫికెట్లు సృష్టించారని ఆరోపించారు. పరీక్ష రాయకుండానే రూ. 15 లక్షలు చెల్లించి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సంపాదించినట్లు ఓ మహిళా అభ్యర్థి టెలివిజన్‌లో అంగీకరించిన విషయాన్ని ప్రస్తావించారు. అనంతపురంలో గణితం డిగ్రీ ఉన్న తిరుమల అనే అభ్యర్థిని ఇంగ్లీష్ టెట్‌లో అర్హత లేకపోయినా ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్‌గా నియమించారని, 75 మార్కులు కటాఫ్ ఉండగా 63 మార్కులు వచ్చిన బీసీ అభ్యర్థి విశ్వేశ్వరరావును ఎంపిక చేశారని పేర్కొన్నారు. ప్రభాకర్ అనే అభ్యర్థిపై 2025 డిసెంబర్‌లో ఆర్డీవో ఇచ్చిన నివేదికను కలెక్టర్ తొక్కిపెట్టారని ఆరోపించారు. పశ్చిమ బెంగాల్, హర్యానా వంటి రాష్ట్రాల్లో జరిగిన టీచర్ రిక్రూట్‌మెంట్ స్కామ్‌లలో మంత్రులు, ఉన్నతాధికారులు సీబీఐ, ఈడీ విచారణలు ఎదుర్కొని జైలుకు వెళ్లిన విషయాన్ని సజ్జల గుర్తుచేశారు. "ఎంతకాలం బాధ్యులైన వారిని కాపాడతారు?" అని ప్రశ్నించారు. ప్రభుత్వం సీబీఐ విచారణకు అంగీకరించకపోతే, తమ వద్ద ఉన్న ఆధారాలతో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఈ అక్రమాలపై ప్రభుత్వం ఎందుకు స్వతంత్ర దర్యాప్తునకు వెనుకాడుతోందో ప్రజలు, అర్హులైన అభ్యర్థులు ప్రశ్నించాలని ఆయన పిలుపునిచ్చారు.